# పెద్ద మనుషులున్నారు!

# జాగ్రత్త!!

(కథ కాదు - అనుభవం)

మరా శాస్త్రి

టాటానగర్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం చాలా రద్దీగా వుంది. బొకారో — మద్రాసు ఎక్స్ ప్రెస్ రావడానికి, ఎంతో టైం లేదు. దక్షిణాది వారంతా యీ బండి ఎక్కాల్సిందే. బొకారో, టాటా, రూర్కెలాల్లో వున్న స్టీలు ఎంప్లాయీస్ అంతా యీ స్టీల్ ఎక్స్ ప్రెస్సు ఎక్కాలి. అంతా వెకేషనరీ టైములోనే ప్రయాణం పెట్టు కుంటారు; పిల్లల చదువు మూలంగ.

బండి అయితే వస్తుంది. కానీ ఎక్కడం ఎలాగ? ప్రతీ వాళ్లూ ఆలోచించేది యిదే. రైలు పట్టాల మీద కాదు పరుగెడు తూంటే; గుండెల్లో పరుగెడు తూంది!

"ఏమండీ ఎలా ఎక్కుతాం ? ఇంత రద్దీగా వుంది ?"

"ఏం చేస్తాం? చెపితే వింటివా? ఎందుకింత లగేజి ? లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్."

"అబ్బ! అసలే చికాకుగా ఉంటే, మీ సూత్రాలూ, స్లోగన్సుతో బోరుకొట్ట కండి!"

"అవునన్నయ్యా ! చెపితే వినక, రెండు బెడ్డింగు లెందుకు? రెండు పెట్టె లెందుకు? ఆ స్టీలు మరచెంబెందుకు? ఆ బేస్కెట్టెందుకు?"

"అదెందుకు ఇదెందు కనటం కాదు! ఏది లేకపోతే కుదురు తుంది చెప్పండి!"

"కుదరడం ఏమిటి? కుదుర్చు కోవాలి!"

"ప్రైమ్మినిష్టర్‌లా మాట్లాడకండీ, మళ్ళీ కాస్తంత సర్దుకోలేరు. అన్నీ సౌఖ్యాలూ తమకే కావాలి! కుదింపు ఎదర వాళ్లకి చెప్పడానికేనా?"

"అందులోనే వుంది తెలివి, సమర్ధతాను! మనం త్యాగంచేసి, ఎదరి వాళ్ళకి యిబ్బంది లేకుండా చూడడం లోనే వుంది, గొప్ప తనం. నా భార్య గొప్పదని చెప్పుకుందుకు నేను గర్వ పడతాను!"

"ఇంక మాట్లాడకండి! నిజం గానే పడగలరు!"

ఆ మిధునం మధ్యకు ఒక ఆగంత కుడు వచ్చి,

"మాష్టరూ! నా బేగ్ చూడండి కొంచెం, ఇప్పుడే వస్తా!" అంటూ, హడావుడిగ వెళ్ళిపోయాడు.

"ఎవరండీ ఈ అబ్బాయి? మా తమ్ముళ్ళా వున్నాడు?"

"నయం ఇంకా! మా బావలా వున్నాడన్నావు కాదు!"

"అవునండీ! అచ్చం మా సూర్యంలా వున్నాడు!"

"పోదూ! ఎవడో ఒహడులా వున్నాడు."

ఆగంతకుడు మళ్ళీ తిరిగి వచ్చాడు.

"ఎలాఎక్కాలో తెలియడం లేదు. ట్రైను వచ్చేస్తూంది! సింగిల్ గాణ్ణి నేనే ఎక్కగలనా లేదా అనిపిస్తుంది.

మీరెలా ఎక్కుతారు ? ఎక్కడికెళతారు.?

"రాజమండ్రియా? నేనూ రాజమండ్రి వాణ్ణే! మా వూరివాళ్లు యిలా అగతగిలేరు. చాలాఆనందంగ వుంది!"

"మీరూ రాజమండ్రీ వస్తున్నారా"

"అబ్బే! నేను సి.కే. పీ లో దిగుతా. మీరో పనిచేయండి. బండి రాగానే, నేను ఎలాగోలా ఓ సీటు సంపాదిస్తా. మీరు ఆ సీటును ఆక్యుపై చేయండి. నా మిత్రుడు ఒకడున్నాడు. అతను డ్యూటీలోనే వుంటే, మీకు టూటైర్‌లో రిజర్వేషన్ ఏర్పాటు చేస్తా. హాయిగా వుంటుంది! ఏమంటారు?"

"ఇంకా అనేదేముంది? అలాగే! మహాభాగ్యం!"

బండి రొజుకుంటూ, రొప్పుకుంటూ వచ్చి ఎదరకంట వెళ్ళి ఆగింది. ఎదురుగావున్న కపార్టుమెంటులోకి, లాఘవంగ దూరి, ఓ సీటు సంపాదించాడు, ఆగంతకుడు.

"మాష్టారూ మీసామానులన్నీ ఇలా అందించండి. ఈ సీటు చూడండి. నా బేగ్ చూడండి !...

"ఆ! అన్నట్టు మీ టికెట్సు ఇలా తెండి! రిజర్వేషన్ కుదిరితే చేరిపోదాం. నేనెలాగో ఎడ్జస్టవుతా. సి కె పి (చక్రధరపూర్) వరకే గదా?"

భర్త రెండు టిక్కట్లు అతని చేతిలో పెడుతూ "త్వరగా రండి! కాకపోయినా మరేం ఫర్వాలేదు! ఎలాగో సర్దుకుందాం! పెట్లోపడ్డాం, ప్రయాణం ఖాయం!"

ఆగంతకుడు అంగలు వేసుకుంటూ నడిచాడు.

విజిలు అయిపోయాక తిరిగివచ్చి "సారీ మాష్టారూ మావాడు "గీతాంజలిలో వెళ్ళిపోయాడట!" అన్నాడు.

"సారీ దేనికి? ట్రై చేశారు కదా? మీరేం చేస్తారు?" అని టిక్కట్లు తీసుకొని దాచుకున్నాడు భర్త గారు.

సికేపి వచ్చింది. ఆగంతకుడు అప్యాయత నందించి, అందుకొని దిగిపోయాడు. ట్రైను కదిలింది.

కంపార్టుమెంటులో టికెట్సు ఎగ్జామినర్ ఎక్కి, టికెట్సు చూస్తున్నాడు. భార్యాభర్తలు సుఖంగా సర్దుకొని కూర్చుని కబుర్లు చెప్పు కొంటున్నారు. ఎగ్జామినర్ దగ్గరగా వచ్చి "టికెట్సు ప్లీజ్" అన్నాడు.

భర్త గారు టికెట్సు అసంకల్పితంగా అందిచ్చి భార్యతో కబుర్లు చెబుతున్నాడు. "ఫేస్ యీజ్ ది ఇండెక్స్ ఆఫ్ ది మాన్ — అన్నారు. ముఖం చూసి చెప్పవచ్చు. దొంగ ఎవరో దొర ఎవరో !"

"సారీ! మాష్టరూ! మీరు సికేపిలో దిగాల్సింది, దాటి వచ్చేశారు! పెనాల్టీ కట్టాలి!"

తృల్లి పడ్డాడు భర్త. కాస్సేపు వాదం జరిగాక, భర్త గ్రహించాడు తానిచ్చిన టిక్కట్లు సికెప టికెట్లని! రాజమండ్రి టికెట్లు ఏమయ్యాయి? తిరిగి వాదం. రాజమండ్రి టికెట్ల నెంబరు వ్రాసుకున్న డైరీ చూపించాడు. ఎగ్జామినర్‌కు తృప్తి కలిగింది. కానీ, ఏంచేస్తాడు? తర్వాత స్టేషన్‌లో బండి ఆగాక, టాటాకి ఫోన్ చేసి అడిగి తెలుసు కున్నాడు. తెలిసిందేవిటంటే —

ఆ టికెట్లు కాన్సిల్ చేయబడి, ఎన్‌కాష్ చేయబడ్డాయసి !

పెద్ద మనుషులున్నారు! జాగ్రత్త !!